మోహన - ఆది

సత్యభామ సర - సపు నగవు
నిత్యము హరిమది - నేనెలవాయ

రుకుమిణిదేవికి రూపయవ్వనికీ
సకల విభవముల - సౌమ్యతలు
చికురాంబరమున - చెదిరిన యలుకలు
వికచాబ్జ ముఖములు - వేయివేలాయె

తొడవుల శ్రీసతి - తొలుమెరుగులకీ
నడపుల మురిపెపు - నగుమోము
తడయక వారిధి - ద్రచ్చినహరికీ
బడలిక బాపను - పరమంబాయె

అనుదినమును నీ - యలమేలుమంగ
కనుగవ జంకెన - గర్వములు
దినదినములు నల - తిరువేంకటపతి
చనవుల సొబగుల - సంపదలాయె

లక్ష్మీ సహస్రనావస్తోత్రంలో, లక్ష్మీ అష్టోత్తర స్తోత్రంలో పేర్కొనబడ్డ విషయం శ్రీమహా లక్ష్మీ శ్రీ విష్ణు హృదయవాసిని అని. అందుకు ప్రమాణాలు కొల్లలు: లక్ష్మీ సమస్త్రనామధ్యాన శ్లోకమిది.

సర్వజ్ఞాం సర్వ జననీం విష్ణు వక్షస్థలాలయాం
దయాళుమనిశంధ్యాయేత్సుఖసిద్ధి స్వరూపిణీం

లక్ష్మీ అష్టోత్తరంలోని వందన శ్లోకమది.

మాతర్నమామి కమలే కమలాయతాక్షీ
శ్రీ విష్ణు హృత్కమలవాసిని విశ్వమాతః
క్షీరోదజే కమల కోమలగర్భ గౌరీ
లక్ష్మీ ప్రసీద సతతం నమతాం శరణ్యే ;

శ్రీమహా లక్ష్మీ త్రిగుణాకారయై రుక్మిణీ సత్యభామలు తానే అయి, అలమేల్మంగా కృతియై అలరినది. శ్రీవేంకటేశ్వరుడే శ్రీకృష్ణుడు. 'రుక్మిణీ సత్యభామాభ్యాతదిదం కృష్ణ మాశ్రయే' అని విష్ణు సహస్రనామ స్తోత్రపీఠిక తిరుమలపైన శ్రీవేంకటేశ్వరుడొక్కడే ఉన్న ప్పటికీ పూర్వాశ్రమపు పురంధ్రులు రుక్మిణీ సత్యభామల సొబగుల సరవులకు ఆయన యెద నిలయమైనది. సత్యభామాదేవి సరసపు సెలవినవ్వు స్వామి మనస్సులో హత్తుకొని నిత్యనూతనంగా విరాజిల్లుతున్నది.

రుక్మిణీదేవికి - నిత్య యౌవనరూప సౌందర్య వైభవ సర్వస్వస్నిగ్ధతతో వికసించిన ఆమె ముఖ కమలం, చెదరిన ఆమె తురుములోని అలకలలో దోబూచులాడుతున్నందు న తద్వదన కమలపునః పునర్దర్శనంవల్ల దశ గుణిత శత సహస్ర కమలోదయం స్వామి అలరింపుకై కలిగినదట.

లక్ష్మీ దేవి మేని ఆభరణాల సొబగులను పొందిన ముచ్చటైన స్మిత ముఖం - క్షీర సాగరమధనం చేసి, కూర్మమై మందరగిరిని మోచిన హరికి కలిగిన అలసటను పాగొ ట్టి సేదదీర్చే అమృతౌషధం అయినది - అమృత సహోదరి నగుమోము అమృత మధను నికి అలసట తీర్చే అమృతౌషధం అయినది. అనునిత్యం ఈ అలమేలుమంగ కను బొమ వింటి వంపుల అతిశయం (సత్యభామగా, రుక్మిణిగా, శ్రీలక్ష్మిగా స్వామికి అలరింపులొనర్చి తానలరినందున గల్గిన అతిశయంవల్ల ఆమె కనుబొమలు పైకి లేచినవి అని చమత్కా రం) శ్రీవేంకటపతికి దినదినపు చనవుల సొబగుల సంపద లైనవి అని అన్నమాచార్యు లు రుక్మిణీ సత్యభామా శ్రీమహాలక్ష్మీ అలమేల్మంగలకూ శ్రీకృష్ణ శ్రీవిష్ణు శ్రీవేంకటేశ్వరు

లకూ అభేదం పాటించి మాలాదీపకాలంకార సువర్ణ సుమమాలా సంకీర్తనం స్వామికీ, స్వామి దేవేరులకూ, సాతార చంద్ర దశ శత సహస్రంగా సమర్పించారు.